
హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


మహబూబ్‌నగర్‌లో యువతుల కేరింతలు

# సరికొత్తగా..

- నూతన సంవత్సరానికి గ్రాండ్ వెల్‌కం పలికిన ప్రజలు
- ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటిన వేడుకలు
- యువత కేరింతలు, డ్యాన్స్‌లు
- కేక్ కట్ చేసి సంబురాలు..
- ప్రధాన ఆలయాల్లో బారులుదీరిన భక్తులు
- కిక్కిరిసిన పార్కులు, దుకాణ సముదాయాలు

*కాలచక్రం గిర్రున తిరిగింది. కష్టసుఖాలు, మంచి చెడులు, తీపి, చేదు అనుభవాలతో 2023 ఇట్టే గడిచిపోయింది. కోటి ఆశలతో 2024 వచ్చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులు సంబురాలు ప్రారంభించారు. యువత కేరింతలు కొడుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. న్యూ ఇయర్ కేకుల కొనుగోళ్లతో బేకరీలు, మద్యం దుకాణాలు, తీరొక్క రంగుల కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కళకళలాడాయి. అందరి మొబైల్స్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్, మెస్సేంజర్, ఇన్‌స్టాగ్రాంలలో 'న్యూ ఇయర్ శుభాకాంక్షలు' సందేశాలు వెల్లువెత్తాయి. ప్రతిఒక్కరూ బంధువులు, స్నేహితులు, సన్నిహితులకు విషెస్ తెలిపారు. డ్యాన్స్‌లు చేస్తూ హోరెత్తించారు. సామూహికంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సందడి చేశారు. మహిళలు ముగ్గులు వేసి తమ ఇంటి వాకిళ్లను అందంగా తీర్చిదిద్దారు. సోమవారం తెల్లవారుజామున నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి, అమ్మవార్ల దర్శనాలకు భక్తులు పోటెత్తారు. మొత్తమ్మీద కొంగొత్త ఆశలతో నూతన సంవత్సరానికి ఘనస్వాగతం పలికారు.*


మహబూబ్‌నగర్ కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు ఎంట్రెన్స్ వద్ద టికెట్ల కోసం క్యూలో నిల్చున్న ప్రజలు


మల్దకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ


మహబూబ్‌నగర్ కేసీఆర్ అర్బన్ పార్కులో భోజనం చేస్తున్న కుటుంబం


నారాయణపేటలో శివలింగానికి మొక్కుతున్న చిన్నారి


జోగుళాంబ అమ్మవారి ఆలయంలో..


మన్యంకొండలో స్వామిదర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

## న్యూ ఇయర్ సందడి

పాలమూరు, జనవరి 1 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అర్చకు లు స్వామివారికి విశేషపూజలు, అలంకరణ నిర్వహించి భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణంలోని లక్ష్మీనర్సింహస్వామి, వీరన్నపేటలోని పెద్ద శివాలయం, రేణుకాఎల్లమ్మ, అయ్యప్ప ఆలయాలను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మన్యంకొండ ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్‌తోపాటు వివిధ ఆలయాల చైర్మన్లు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



## శ్రీశైల ఉత్తర ద్వారంలో భక్తుల రద్దీ

అచ్చంపేటరూరల్, జనవరి 1 : శ్రీశైల ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న ఉమామహేశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు చేరుకొని స్వామివారికి అభిషేకంతో పాటు పూజలు చేశారు. ఇబ్బందులు కలుగకుండా ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది ఉన్నారు.



బుద్ధారం గండి ఆంజనేయ స్వామి ఆలయంలో..

## పోటెత్తిన భక్తులు

గోపాల్‌పేట, జనవరి 1 : న్యూఇయర్ సందర్భంగా బుద్ధారం గండి ఆంజనేయస్వామి, ఏదుల ఎర్రగట్టు ఆంజనేయస్వామి ఆలయాలకు ప్రజలు పోటెత్తారు. బుద్ధారం గ్రంథాలయ భవనంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో విశ్వవాణి గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు నాగేంద్రం, ప్రధాన కార్యదర్శి పూల్యానాయక్, కోశాధికారి ఉమామహేశ్వర్, సభ్యులు ఓంకార్, శివకుమార్ పాల్గొన్నారు.

# హోరాహోరీగా..

- రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం
- టోర్నమెంట్‌లో పాల్గొన్న 10 జిల్లాల జట్లు
- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి
- ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్ష
- సత్తా చాటిన మహబూబ్‌నగర్ బాలబాలికల జట్లు


తలపడుతున్న మహబూబ్‌నగర్, హైదరాబాద్ బాలికల జట్లు

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 1: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో సోమవారం ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల,బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, డీఈవోతో కలిసి ప్రారంభించారు. మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ మైదానంలో బాలికలకు, శ్రీరామ ల్యాండ్‌మార్క్‌లో బాలుర పోటీలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం, మెదక్ జిల్లా జట్లు టోర్నీలో పాల్గొన్నాయి.

***మహబూబ్‌నగర్ జట్టు శుభారంభం..***

జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో మహబూబ్‌నగర్ బాల, బాలికల జట్లు శుభారంభం చేశాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు నల్లగొండపై 15-04, ఆదిలాబాద్‌పై 15-08 గోల్స్ తేడాతో గెలిచింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు మెదక్‌పై 8-6, హైదరాబాద్‌పై 10-09 గోల్స్ తేడాతో గెలిచింది. బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు నల్లగొండపై 9-8, కరీంనగర్ జట్టు ఖమ్మంపై 10-06, ఆదిలాబాద్ జట్టు ఖమ్మంపై 11-06, నల్లగొండ జట్టు కరీంనగర్‌పై 12-08, వరంగల్ జట్టు రంగారెడ్డిపై 11-05, వరంగల్ జట్టు మెదక్‌పై 9-8, నిజామాబాద్ జట్టు 10-05 గోల్స్ తేడా గెలిచాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు ఖమ్మంపై 07-06, కరీంనగర్ జట్టు నిజామాబాద్‌పై 11-05, హైదరాబాద్ జట్టు మెదక్‌పై 9-6, వరంగల్ జట్టు నల్లగొండపై 13-01, హైదరాబాద్ జట్టు నల్లగొండపై 8-2 గోల్స్ తేడాతో గెలిచాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ రష్మిత, ఏఎంవో బాలుయాదవ్, సీఎవో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ సురేశ్‌కుమార్, మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, టోర్నీ ఆర్గనైజర్ జీయావుద్దీన్, పీఈటీలు వేణుగోపాల్, బాలు, నిరంజన్‌రావు, ఆసిఫ్, అనిల్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


ముస్తాబైన సంతాన వేణుగోపాలస్వామి ఆలయం


స్వామి వారి మూల విరాట్

# నేడే బ్రహ్మోత్సవం

- కొలిచిన వారికి కొంగుబంగారం.. సంతాన వేణుగోపాలస్వామి
- నేటి నుంచి ఉత్సవాలు, సాయంత్రం కల్యాణోత్సవం
- రేపు రథోత్సవం, 4న పారువేట, ప్రత్యేక పూజలు
- గద్వాల చిన్న జాతరగా ప్రసిద్ధి

గద్వాలటౌన్, జనవరి 1 : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిగా.. కొలిచిన వారికి కొంగు బంగారంగా గద్వాలలోని భీంనగర్‌లో కొలువైన సంతాన వేణుగోపాలస్వామి భక్తులతో నిత్యపూజలందుకుంటున్నారు.. ఆ పక్కనే స్వయంభూగా వెలిసిన హయగ్రీవస్వామి వారు నిత్యం భక్తులతో అఖండ పూజలు అందుకుంటున్నాడు.. దీంతో ఆలయం ఎంతో విశిష్టతను సంతరించుకుంది. ప్రతి ఏడాది మార్గశిర మాసంలో స్వామి బ్రహ్మోత్సవాలను సంస్థానకాలం నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలనే గద్వాల చిన్నజాతర అని కూడా అంటారు. నాటి ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా మూడు రోజులపాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే స్వామిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

***కొలిచిన వారికి కొంగు బంగారం..***

గద్వాల సంస్థానాధీశుల పాలనలో ఎన్నో ప్రసిద్ధ ఆలయాలను నిర్మాణం చేపట్టారు. ఈ ప్రసిద్ధ ఆలయాల్లో ఎంతో విశిష్టత గల ఆలయం సంతాన వేణుగోపాలస్వామి ఆలయం. స్వామి వారి విగ్రహాన్ని నల సోమనాద్రి ప్రతిష్ఠించగా ఆలయాన్ని సంస్థానంలో 6వ తరానికి చెందిన రాజా సీతారాంభూపాల్ తల్లిదండ్రులు భీంరెడ్డి, లక్ష్మీనాంచారమ్మ నిర్మించినట్లు చరిత్ర చెబుతున్నది. ప్రస్తుతం రాజవంశస్తులైన డాక్టర్ విక్రమసింహారెడ్డి, సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజా కార్యక్రమాలు, ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే సంతాన వేణుగోపాలస్వామిని 41రోజులు ఎవరైతే భక్తి శ్రద్ధలతో కొలుస్తారో వారికి సంతానం తప్పక కలుగుతుందని భక్తుల నమ్మకం. అలాగే స్వామి వారిని ప్రతిష్ఠించిన స్థలంలోనే హయగ్రీవస్వామి స్వయంభూగా ఉద్భవించారని ఆలయ అర్చకులు చెబుతున్నారు. ఇరువురు స్వాములు కొలువున ఆలయంగా విరాజిల్లుతుందని ఇక్కడ భక్తులు భక్తితో వేడుకుంటే వారిని కోరిన కోరికలు తీరుతాయని నమ్మకం ఇప్పటికీ ఉన్నది.

***గద్వాల చిన్నజాతర..***



బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భీంనగర్‌లో జాతర ఏర్పాటవుతున్నది. ఈ జాతరను గద్వాల చిన్నజాతర, భీంనగర్ జాతర అని పిలుస్తారు. ఈ జాతర సందర్భంగా పెద్ద ఎత్తున అంగళ్లు వెలుస్తాయి. అలాగే రంగుల రాట్నాలు, సర్కస్ తదితర వాటిని ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా ఈ జాతరకు ప్రత్యేకంగా మాంసం అంగళ్లు ఎక్కువగా వెలుస్తాయి. జాతర దాదాపు నెల రోజులపాటు సాగుతుంది.

***నేటి నుంచి బ్రహ్మోత్సవాలు..***

స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం 10 గంటల నుంచి పుణ్యాహావచనం, అంకురార్పణతో పూజలు ప్రారంభం కానున్నాయి. 11 గంటలకు ధ్వజారోహణం, భేరిపూజ, హోమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 10 గంటలకు నిత్యహోమం, రాత్రి 8 గంటలకు రథోత్సవం, స్వామివారి సేవ, ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. గురువారం ఉదయం పారువేట, 3 గంటలకు తీర్థావళి, నాగవల్లి, పూర్ణాహుతి దేవతా విసర్జనలు ఉంటాయని ఆలయ ప్రధాన అర్చకులు బోరవెల్లి పవన్‌కుమర్, రాఘవాచారి తెలిపారు.

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- పాలమూరు మైనార్టీగురుకులంలో స్టూడెంట్ మృతిపై అనుమానం
- కళాశాల ఎదుట కుటుంబ సభ్యుల నిరసన



మృతి చెందిన విద్యార్థి రాంరెడ్డి (ఫైల్), ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న డీఎస్పీ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 1 : ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకులంలో సోమవారం చోటు చేసుకున్నది. కాగా, మృతిపై అనుమానం ఉందని, వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని విద్యార్థి కుటుంబ సభ్యులు కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని భూనీడ్‌కు చెందిన లక్ష్మి, హనుమంతురెడ్డి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు రాంరెడ్డి(17) మహబూబ్‌నగర్ మైనార్టీ గురుకుల పాఠశాల-2లో ఇంటర్ సీఈసీ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం రాత్రి న్యూ ఇయర్ వేడుకల్లో మిత్రులతో కలిసి రాత్రి 3 గంటల వరకు సరదాగా గడిపాడు. అనంతరం హాస్టల్ నుంచి పై ఫ్లోర్‌లో ఉన్న కళాశాల తరగతి గదికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొన్నాడు. సోమవారం ఉదయం 9:30కు గుర్తించిన నిర్వాహకులు రాంరెడ్డిని కిందకు దించి హుటాహుటిన జిల్లా దవాఖానకు తరలించారు. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తల్లిదండ్రులకు తెలపడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున కళాశాలకు తరలివచ్చి రాంరెడ్డి మృతిపై విచారణ నిర్వహించి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్ బుర్కాఫాతియా మాట్లాడుతూ రాంరెడ్డి బాగా చదివేవాడని, కళాశాలలో ఏం జరిగి ఆత్మహత్యకు చేసుకున్నాడో తెలియడం లేదన్నారు. రాంరెడ్డికి ఎలాంటి సమస్యలు లేవని, చదువులోనూ చురుకుగా ఉండేవాడని, అందరితో కలుపుగోలుగా ఉంటాడని, ఆత్మహత్య చేసుకొనే పరిస్థితే లేదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం రాంరెడ్డి మృతిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, రూ. 50 లక్షలు నష్టం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ దవాఖాన వద్ద ఆందోళన నిర్వహించారు. ఆత్మహత్య విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు సీఎం అన్న తిరుపతిరెడ్డికి ఫోన్‌లో తెలిపారు. ఆందోళన విషయం తెలుసుకున్న డీఎస్పీ మహేశ్ సీఐలు ప్రవీణ్ కుమార్, సైదులు, శ్రీనివాస్, చంద్రశేఖర్‌తో పాటు పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం రాంరెడ్డి మృతిపై కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.